## క్లుప్తంగా

### బీఎల్‌ఓలకు అవగాహన



**మద్దూరు:** ఓటర్ల జాబితా, కొత్త ఓటర్ల నమోదుపై సోమవారం మద్దూరు, కొత్తపల్లి తహసీల్దార్లు జయరాములు, అనిల్‌కుమార్ బీఎల్‌ఓలకు ఆయా మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటర్ల జాబితా తయారీ, ఇతర అంశాలపై మాస్టర్ ట్రెయినర్స్ శ్రీకాంత్ కుమార్, మోహన్, అబ్దుల్‌హక్, రవి శిక్షణ ఇచ్చారు.

### ఎమ్మెల్యేకు సన్మానం

**మక్తల్:** ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని బీసీ ఐక్యవేదిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఆయన నివాసంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రంగప్ప, కుమ్మరి రాజు, అశోక్‌గౌడ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పీఏసీఎస్ ఇన్‌చార్జ్ చైర్మన్ నియామకం

**మద్దూరు:** దమ్‌గాన్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇన్‌చార్జ్ చైర్మన్‌గా ఆంజనేయులు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. చైర్మన్‌గా ఉన్న జగదీశ్వర్ తన పదవికి శనివారం రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న భూనీడ్ డైరెక్టర్ ఆంజనేయులు ఇన్‌చార్జ్ చైర్మన్‌గా నియామకమయ్యారు. కొత్త చైర్మన్ ఎన్నిక ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత ఎన్నుకోనున్నట్లు సీఈఓ మహిపాల్ తెలిపారు.

### పాఠశాలకు క్రీడాసామగ్రి అందజేత

**మక్తల్:** మండలంలోని పంచదేవ్‌పాడు ప్రభుత్వ పాఠశాలకు మంజూరైన క్రీడాసామగ్రి పంచాయతీ కార్యాలయం వద్ద హెచ్‌ఎం మహేశ్వరికి సోమవారం సర్పంచ్‌కల్పన అందజేశారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి మహేష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

### 22న వేసెక్టమీ శిబిరం

**పాలమూరు:** జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఈనెల 22న వేసెక్టమీ వెసక్టమి ఆపరేషన్స్ క్యాంపు ఉంటుందని ఎంహెచ్‌ఎన్ పీవో డాక్టర్ భాస్కర్ నాయక్ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా అవగహన కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. సోమవారం ఆస్పత్రి ఆవరణలో కరపత్రాలు ఆవిష్కరించారు. కుటుంబ నియంత్రణలో మగవారి బాధ్యత మరింత పెరగాలని ఆపరేషన్లు చేసుకోవడానికి ముందుకురావాలన్నారు. ఆపరేషన్ చేసుకున్న వారికి రూ.1100 ప్రోత్సాహక నగదు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా క్షయ నియంత్రణ అధికారి రఫీక్, మాస్‌మీడియా అధికారి జి.తిరుపతిరావు సిబ్బంది పాల్గొన్నారు.

### కొత్త ఓటర్ల నమోదుకు మరో అవకాశం

**దేవరకద్ర:** కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల కమిషన్ మరో అవకాశం ఇచ్చిందని తహసీల్దార్ బ్రహ్మంగౌడ్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన బీఎల్‌ఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 1 వరకు అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. అదేవిధంగా అడ్రస్ మార్పు, తప్పుల సవరణకు దరఖాస్తులను తీసుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులను పరిశీలించి విచారణ చేయాలని తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

**అడ్డాకుల:** మూసాపేట మండలం చక్రాపూర్ స్టేజీ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి..జానంపేటకు చెందిన సాయిలు జాతీయ రహదారి వద్ద మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు వైపు నుంచి రోడ్డు దాటుతుండగా మహబూబ్‌నగర్ నుంచి కొత్తకోట వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో సాయిలు కాలు ఫ్యాక్చర్ కావడంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికుల సమాచారంతో టోల్‌ప్లాజా అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా కేంద్రానికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

### గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

**శాంతినగర్:** శాంతినగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 ఏడాదికి సంబంధించి కెమిస్ట్రీ బోధించుటకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చంద్రమోహన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. పీజీలో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, ఇతరులకు 55 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండి పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత కలిగి బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈనెల 21 గురువారం సాయంత్రం 5గంటల లోపు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. 22 శుక్రవారం ఉదయం 11గంటలకు ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీకళాశాల గద్వాలలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలని తెలిపారు.

# బస్సులను పునరుద్ధరించండి

- విద్యార్థులకు తప్పని కాలినడక
- గ్రామాల్లో మహిళలకు లభించని ఉచిత బస్సు సౌకర్యం



పెద్దపొర్ల స్టేజి వద్ద బస్సు కోసం రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

**ఊట్కూర్:** ప్రభుత్వం పల్లెపల్లెకు బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు, పలు గ్రామాల నుంచి హైదరాబాద్‌కు బస్సును పునరుద్ధరిస్తే మహిళలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి పథకం' ఆశయం నెరవేరుతుందని మండల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రతి గ్రామానికి బీటీ రోడ్ల సౌకర్యం ఉన్నా, ఆర్టీసీ అధికారులు బస్సును నడిపించడం లేదని విద్యార్థులు, ప్రజలు చెబుతున్నారు. విద్యార్థులు పట్టణాల్లో ఉన్నత చదువులకై పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లేందుకు పలు గ్రామాల స్టేజీల వరకు కాలినడన తప్పడం లేదు. మండలంలో సమస్తాపూర్, పెద్దపొర్ల, మల్లెపల్లి, లక్ష్మీపల్లి, ఓబ్లాపూర్, బాపూర్ గ్రామాలకు ప్రభుత్వం బీటీ రోడ్డు సౌకర్యం కల్పించింది. పెద్దపొర్ల, చిన్నపొర్ల, ఓబ్లాపూర్, కొల్లూర్ విద్యార్థులు నారాయణపేట, మక్తల్ కళాశాలలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**హైదరాబాద్‌కు బస్సులు..**

గతంలో ఉదయం నారాయణపేట నుంచి– ఊట్కూర్– బిజ్వార్– పులిమామిడి మీదుగా హైదరాబాద్, నారాయణపేట నుంచి ఊట్కూర్ – చిన్నపొర్ల మీదుగా హైదరాబాద్‌కు రెండు బస్సులను నడిపించేవారు. రెండేళ్ల నుంచి బస్సుల కొరత ఉందని ఊట్కూర్ మీదుగా హైదరాబాద్ బస్సును నిలిపివేశారు. మల్లేపల్లి స్టేజీ నుంచి చిన్నపొర్లకు బీటీ రోడ్డు గుంతమయమైందని చిన్నపోర్ల మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే బస్సును నిలిపివేశారు. చిన్నపొర్లకు బీటీ రోడ్డు వేసి రెండేళ్లు కావస్తున్నా బస్సు నడిపించడం లేదు. ఊట్కూర్, మొగ్దంపూర్, బిజ్వార్, పులిమామిడి, చిన్నపొర్ల నుంచి ప్రతి నిత్యం ఉద్యోగులు, ప్రజలు ప్రయాణించేందుకు సౌకర్యంగా ఉండేది.

### స్టేజీ వరకు నడుచుకుంటూ..



ఊట్కూర్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాను. గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. గ్రామం నుంచి రోజు 30 మంది విద్యార్థులు ఊట్కూర్ – మక్తల్– నారాయణణపేటకు ఉన్నత చదువుల చదివేందుకు వెళ్తుంటారు. గ్రామం నుంచి స్టేజీ వరకు 4కి.మీ. దూరం ఉంది. రోజూ స్నేహితులతో కలిసి స్టేజీ వరకు నడుస్తున్నాం.

–కావేరి, విద్యార్థి, పెద్దపొర్ల,

### పలుమార్లు నిరసనలు తెలిపాం



పెద్దపొర్ల, చిన్నపొర్ల, కొల్లూర్ విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు మక్తల్, నారాయణపేట కళాశాలలకు నిత్యం వెళ్తుంటారు. గ్రామలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు రోజు 3, 4 కి.మీ. కాలినడన స్టేజీల వరకు వెళ్తున్నారు. విద్యార్థులు రోజు నడవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారు. పలుమార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టాం. ఆర్టీసీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదు.

–అజయ్ కుమార్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు, పెద్దపొర్ల

# మహిళా సాధికారితకు కృషి



మాట్లాడుతున్న సంస్థ డైరెక్టర్ ప్రశాంతి

**మద్దూరు:** సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, బాల్యవివాహాలను, లైంగికదాడులను నివారించి, గ్రామాల్లో చైతన్య పరచడానికి భూమిక ఉమెన్స్ కలెక్టివ్ సంస్థ పనిచేస్తుందని సంస్థ డైరెక్టర్ ప్రశాంతి తెలిపారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ప్రజా ప్రతినిధుల అవగాహన సదస్సులో మాట్లాడారు. సంస్థ ద్వారా మద్దూరు, దామరగిద్ద మండలంలోని 45 గ్రామాలను ఎంపిక చేసి మహిళా అభ్యున్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు. బాలికలను తప్పని సరిగా డిగ్రీ వరకు చదివించాలన్నారు. ప్రజాప్రతినిధులు మహిళా సాధికారిత కోసం పనిచేస్తున్న సంస్థకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ జయరాములు, సూపరింటెండెంట్ కృష్ణారావ్ తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ ఆశయాలను సాధించాలి



బిజ్వార్‌లో పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

**ఊట్కూరు:** భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేద్దామని పీవైఎల్ ఉపాధ్యక్షుడు సిద్దు అన్నారు. సోమవారం మండలంలోని బిజ్వార్‌లో పీవైఎల్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న పాతపల్లిలో భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ ఉంటుందని కార్యక్రమానికి ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. మండలంలోని యువత పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. విద్యార్థులు, యువకులు చిన్నతనం నుంచే దేశభక్తిని అలవరుచుకోవాలని దేశనాయకుల జీవిత చరిత్రలు చదవాలని కోరారు. కార్యక్రమంలో పొర్ల నర్సింహులు, కొండప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.

**ధన్వాడ:** మండలంలోని పాతపల్లిలో 21న నిర్వహించనున్న భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం విజయవంతం చేయాలని సీపీఐ ప్రజా పంథా పార్టీ నాయకుడు రాము కోరారు. సోమవారం పాతపల్లిలో విలేకర్ల సమావేశం ఆయన మాట్లాడారు.

# మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



ధన్వాడలో మహాపడి పూజలు చేస్తున్న భక్తులు

**ధన్వాడ:** పట్టణం అయ్యప్ప నామస్మరణంతో మార్మోగింది. మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడిపూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని రథంలో ఉంచి గ్రామ పురవీధుల గుండా ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 18 మెట్ల పడిని వివిధ రకాల పూలు, పండ్లతో అలంకరించి స్వామివారికి మెట్టు మెట్టుకు దీపాలు పెట్టి పంచామృతాభిషేకం, మహాపడిపూజ చేశారు.

### నేడు బయటి మారెమవ్వ బోనాలు



అమ్మవారి ఆలయం

**మాగనూర్:** మండల కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో వెలసిన బయటి మారెమవ్వ బోనాలు మంగళవారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ రాజు తెలిపారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం పంటలు కోతలు ముగించి ధాన్యం ఇంటికి చేరిన తర్వాత బోనాలు గ్రామస్తులు కలిసి నిర్వహించుకోవడం ఆనవాయితీ అని తెలిపారు. బోనాలకు మండల ప్రజలతో పాటు ముంబాయి, హైదరాబాద్, బెంగుళూర్ నుంచి అధిక సంఖ్యలో పాల్గొంటారని పేర్కొన్నారు.

### సామూహిక పద్యార్చన

**మక్తల్:** పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో గురువుల పద్యార్చన కార్యక్రమం నిర్వహించారు. శాంతి సద్భవన యాత్రలో భాగంగా అమ్మశతకం, నాన్నశతకం, గురువు శతకంలోని రచించిన పద్యాలను కంఠస్థం చేసి సామూహిక గానం చేశారు. విద్యార్థులు అమ్మ, నాన్న, గురువుల గొప్పతనంతో పద్యాలరూపంలో వివరించడంతో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, భాస్కర్, అబ్దుల్‌వహిద్ తదితరులు పాల్గొన్నారు.

### కల్తీ మద్యం అరికట్టండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

**దేవరకద్ర:** గ్రామాల్లో కల్తీ మద్యం, సారాను పూర్తి స్థాయిలో అరికట్టాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి కోరారు. సోమవారం దేవరకద్రలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్టు షాపుల పై నిఘా ఉంచాలని కోరారు. యువత కల్తీ మద్యం బారిన పడకుండ చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

**కార్యకర్తలే మా బలం**

**భూత్పూర్:** కార్యకర్తలే తమ బలమని, ఎల్లవేళలా రుణపడి ఉంటానని ఎమ్మెల్యే జి. మధుసుదన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో కార్యకర్తలతో విజయోత్సవ సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీని గెలిపించేందుకు కృషిచేయాలన్నారు. త్వరలోనే బీఆర్‌ఎస్ కనుమరుగవుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం గుడ్‌మార్నింగ్ దేవరకద్ర కార్యక్రమం నిర్వహిసున్నట్లు వివరించారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, టౌన్ అధ్యక్షుడు నవీన్ గౌడ్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థికి అభినందన



**మహబూబ్‌నగర్ క్రీడలు:** రాజస్థాన్‌లో వచ్చే నెల 9 నుంచి 13 వరకు జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని అపెక్స్ స్కూల్ విద్యార్థి పారిజాత ఎంపికైంది. కాగా పారిజాతను సోమవారం పాఠశాలలో డైరెక్టర్ రామారావు, ఏఏఓ నాగమణి, ప్రధానోపాధ్యాయుడు చైతన్యరెడ్డి అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీలు మహ్మద్ ఉస్మాన్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు



రాజోళిలో సుబ్రమణ్య స్వామి విగ్రహాలకు పాలు పోస్తున్న మహిళలు

**రాజోళి:** సుబ్రమణ్య స్వామి పుట్టిన రోజు సుబ్రమణ్య షష్టి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని అడివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన సుబ్రమణ్య స్వాముల విగ్రహాలకు ఈసందర్భంగా అర్చకులు అడివిస్వామి ఆధ్వర్యంలో మంత్రోచ్చరణల మధ్య నాగప్పలకు పాలుపోసి ప్రత్యేక పూజలు చేశారు. నాగదోషాలు, సర్పదోషాలు ఉన్నవారు, సంతానం లేని వారు అధిక సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించి సుబ్రమణ్యస్వామి వారి ఆశీర్వాదాలు పొందారు.

**వడ్డేపల్లి మండలంలో..**

వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లో సుబ్రమణ్య షష్టి పర్వదినాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నాగ ప్రతిమలకు పాలు పోసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నాగదోషాలున్న భక్తులు దోషాలు తొలగాలని కోరుకుంటూ పూజలు చేశారు.

# శిథిలావస్థలో గ్రంథాలయం



ధన్వాడ గ్రంథాలయం

**ధన్వాడ:** విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయాలు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారుతున్నాయి. మండల కేంద్రంలో 36ఏళ్ల క్రితం గ్రంథాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీన్ని 20 ఏళ్ల కిందట ప్రత్యేకంగా భవనం నిర్మించి అందులోకి మార్చారు. ఇది నాసిరకంగా నిర్మించడంతో కొద్దిరోజులకే శిథిలావస్థకు చేరింది. భవనం పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. చిన్నపాటి వర్షం వచ్చినా పుస్తకాలు తడిసి ముద్దవుతున్నాయి. అంతేకాకుండా ఇక్కడ విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. ఇప్పటి వరకు 350 మంది చందాదారులు, రోజూ గ్రంథాలయానికి సుమారు 150 మంది పాఠకులు వెళ్లేవారు. భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు పుస్తకాలు లేకపోవడంతో గ్రంథాలయ

**అటెండర్‌తోనే నిర్వహణ**

మండల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న లైబ్రేరియన్ నర్వ మండలానికి ఇన్‌చార్జ్‌గా కేటాయించారు. దీంతో ఇక్కడ, అక్కడ విధులు నిర్వహించలేకపోతున్నాడు. అటెండర్‌తోనే గ్రంథాలయ నిర్వహణ కొనసాగిస్తున్నారు. గ్రంథాలయానికి పక్కనే పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్సీ హాస్టల్ ఉన్న ఉద్యోగ పరీక్షలకు సిద్ధం కాలేకపోతున్నారు విద్యార్థులు. ఉన్న పుస్తకాలకు చెదలు పట్టి అవి పనికిరాకుండా పోయాయి.

### సౌకర్యాలు శూన్యం..

భవనం నిర్మించిన నాటి నుంచి ఇప్పటి వరకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా చుట్టూ ప్రహరీ, పాఠకులకు మురుగుదొడ్ల సౌకర్యాలు కూడా లేవు. ఉన్న స్థలాన్ని కూడా కొందరు కబ్జా చేసుకుంటున్నారు. గ్రంథాలయాల చైర్మన్‌లు వస్తున్నారు.. వెళ్తున్నారు. కొత్త భవనం కట్టిస్తామని చెప్పి తిరిగి చూడటం లేదు. ఇప్పటికైనా జిల్లా గ్రంథాలయ శాఖాధికారులు స్పందించి మరమ్మతు చేసి పూర్వవైభవం తీసుకురావాలని పాఠకులు కోరుతున్నారు



కూలడానికి సిద్ధంగా ఉన్న పుస్తకాల గది

# శ్రీరాముని అక్షింతల ఊరేగింపు



నర్వలో అక్షింతల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

**నర్వ:** అయోధ్య శ్రీరాముల వారి అక్షింతల ఊరేగింపు కార్యక్రమం సోమవారం రాత్రి మండల కేంద్రంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలమూరు జిల్లా కేంద్రం నుంచి తీసుకొచ్చిన అక్షింతలను ఊరి బయటి ఆంజనేయస్వామి ఆలయంలో ఉంచారు. సాయంత్రం ఆలయం నుంచి శ్రీరామనామ సంకీర్తనలచే ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక శివాలయంలో అక్షింతలకు అర్చకులు సిద్ధయ్య ప్రత్యేక పూజలు, మహా మంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ మండల కన్వీనర్ వెంకటేష్ మాట్లాడుతూ.. ఈ నెల 28 వరకు ఆలయంలోనే ఉంచి 28న, ఉదయం 10 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం మండలంలోని 19 గ్రామాలకు ఈ అక్షింతలను ప్రత్యేక పాత్రలో అందిస్తామన్నారు.

# ప్రారంభించి.. వదిలేశారు



తాళం వేసి ఉన్న గండేడ్ కేజీబీవీ

- గండేడ్ కేజీబీవీలో కొనసాగని తరగతుల నిర్వహణ
- సిబ్బంది కేటాయింపు లేని వైనం
- అందుబాటులోకి తీసుకురావాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

**గండేడ్:** విద్యాలయాల విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తుండడం విద్యార్థుల పాలిట శాపంగా మారుతోంది. వాటిని ప్రారంభించడంలో చూపిన శ్రద్ధ నిర్వహించడంలో చూపడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. దీంతో లక్ష్యానికి తూట్లు పడుతున్నాయని.. . గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని వాపోతున్నారు. గండేడ్ కేజీబీవీ ఏర్పాటు ఇందుకు చక్కని ఉదాహరణగా నిలుస్తుందని అంటున్నారు. హంగు ఆర్భాటాలతో ప్రారంభోత్సవం చేసి వదిలేశారని చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మహమ్మదాబాద్ మండలంగా ఏర్పాటు కాక ముందు.. గండేడ్‌కు సంబంధించి కేజీబీవీని 2005లో మహమ్మదాబాద్‌లోనే ఏర్పాటు చేశారు. అప్పట్లో ఉమ్మడి మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలోని విద్యార్థులు ఇక్కడ పదో తరగతి వరకు విద్యాభ్యాసం కొనసాగించారు. అయితే 2020 అక్టోబర్‌లో గండేడ్ నుంచి మహమ్మదాబాద్ విడివడి కొత్త మండలంగా ఆవిర్భవించింది. అయినా ఉమ్మడి మండలానికి ఇదే పాఠశాల కొనసాగుతూ వచ్చింది. మొదటగా పదో తరగతి వరకు ఉన్న దానిని ఇంటర్ వరకు పొడిగించారు. ప్రసుతం 450 మంది విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే గండేడ్ మండలానికి వేరుగా కొత్త కేజీబీవీని మంజూరు చేస్తున్నట్లు గత సంవత్సరం ప్రకటించడంతో స్థానికులు సంతోషించారు. ఈమేరకు ఆరోతరగతికి సంబంధించి కొత్తగా అడ్మిషన్లు కూడా జరిగాయి. కానీ అనుమతులు లేవని అంతటితో నిలిపివేశారు. దీంతో గండేడ్ పేర జాయిన్ అయిన విద్యార్థులను తిప్పి పంపలేక మహమ్మదాబాద్‌లోనే పై అధికారులు ఆదేశించడంతో కొనసాగించారు. దీంతో రెండు మండలాల విద్యార్థులు ఒకేచోట కావడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కొత్త కేజీబీవిని మంజూరు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ అది ప్రారంభోత్సవానికే పరిమితం అయ్యింది.

**హడావుడి ప్రారంభం...**

గండేడ్‌కు కొత్త కేజీబీవీని మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో హడావుడిగా ప్రారంభోత్సవం చేశారు. ఎన్నికల కోడ్ వస్తుందని అదే రోజు ముందు మండల పరిధిలోని పలు భూమిపూజలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి చేశారు. మహమ్మదాబాద్ కేజీబీవీ నుంచి కొంత మంది విద్యార్థులను తీసుకువచ్చి.. జిల్లా అధికారులతో గండేడ్ కేజీబీవీని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఆరు, ఏడు తరగతులల్లో ఉన్న పిల్లలతో కొనసాగిస్తామని చెప్పారు. కానీ అది నేటికీ అమలుకు నోచుకోలేదు. ప్రారంభించిన కేజీబీవీకి ప్రస్తుతం తాళం వేసి ఉంది. దీంతో తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గండేడ్ కేజీబీవీని ప్రారంభిస్తున్న అప్పటి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి(ఫైల్)

### పక్కా భవనం కరువు...

గండేడ్ కేజీబీవీకి పక్కా భవనం లేదు. తాత్కాలికంగా మండల కేంద్రంలోని అతిథిగృహం భవనంలో దీనిని కొసాగించాలని అధికారులు భావించారు. అందులో భాగంగానే అక్కడే ప్రారంభోత్సవం చేశారు. అయితే ఇక్కడ ఎలాంటి వసతులు లేవు. మూడు గదులు, వరండా తప్ప పూర్తిస్థాయి సౌకర్యాలేమీ లేవు. వంట గదులు, డైనింగ్ హాల్, బాత్‌రూంలు, మరుగుదొడ్లు తదితర ఏవీ కూడా లేకపోవడంతో అక్కడ పాఠశాల నిర్వహించడం కష్టమేనని తేలిపోయింది. ప్రస్తుతం గండేడ్ కేజీబీవీకి సంబంధించిన విద్యార్థులు ఆరు, ఏడు తరగతులకు కలిపి ఆరవై మందికి పైగా ఉన్నారు. వీరికి కూడా ఇప్పుడు తాత్కాలిక వసతి సరిపోవడం కష్టమేనని పలువురు చెబుతున్నారు. అంతేకాకుండా ఇప్పటి వరకు సిబ్బంది కేటాయింపూ జరగలేదని విమర్శిస్తున్నారు. దీంతో కేజీబీవీ కొనసాగుతుందా లేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### త్వరలో ప్రారంభిస్తాం



గండేడ్ కేజీబీవీకి ఎన్నికలకు ముందు ప్రారంభోత్సవం చేశారు. అంతలోనే ఎన్నికలు వచ్చాయి. హడావుడి ఉండడంతో అధికారులంతా బిజీగా ఉండిపోవడంతో అప్పట్లో దానిని కొనసాగించే వీలు లేకపోయింది. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో దానిపై దృష్టి సారిస్తాం. ఉన్నతాధికారులతో సంప్రదించి త్వరలో అందుబాటులోకి తీసుకువస్తాం.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్